


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.

హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్ వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)

అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.

# పాతాళభైరవి – 2

.

రాజమందిరం. రాజు,రాణి చదరంగం ఆడుతూవుంటారు. రాణీగారి తమ్ముడు ప్రవేశం: బావగారూ,అక్కయ్యా– రాజద్రోహులు కుట్ర చేస్తున్నారు.

రాణి:ఎక్క డ తమ్ముడూ?

రాణీగారి తమ్ముడు : సత్రంలో అక్కయ్యా. చెలరేగిపోతున్నారే. ఇక పన్ను గిన్ను ఇచ్చేదిలేదట. రాజేమిటి?రాణీ ఏమిటి?అని అడుగుతున్నారు. –రాజు వానివైపు ఒకసారి చూసి మళ్ళీ ఆటవైపు దృష్టిసారిస్తాడు.

రాణి: ఇంకా చూస్తారేమిటండీ?వాళ్ళ తలలు తీసి కోటగుమ్మానికి కట్టించక.

రాజు(వివేకవంతుడు): రాణీ. ఎవరితలలో? ఎందుకు తియ్యాలో ? అదైనా తెలియాలా? ఊఁ?

రాణి: అంతా చెప్పరా తమ్ముడూ.వింటారు.

రాణీగారి తమ్ముడు: తోటరాముడే.తోటముసిల్దాని కొడుకు. వాడొట్టి కొండముచ్చు. మట్టిమొహం.

రాజకుమారి ప్రవేశం: ఎవర్ని మామయ్యా?నువ్వంత పొగిడేస్తున్నావ్?

రాణీగారి తమ్ముడు:పొగడటమేమిటి? తప్పుతప్పు. తిడుతున్నాను. వాడితోనేమిటీ? ఆ తోటరాముడు ఏం చేశాడో సరిగ్గా చెప్పరా.

రాణీగారి తమ్ముడు: ఇంకేంచెప్పనే అక్కా? వాడు రాజు కావాలిట. వాడి స్నేహితుడు అంజిగాడు మంత్రికావాలిట. వాళ్ళిద్దరూ జట్టుగాళ్ళతోచేరి కుట్రచేస్తున్నారు.

రాజకుమారి(రా.కు): మరినువ్వు చూస్తూ ఊరుకున్నావా మామయ్యా?

రాణీగారి తమ్ముడు: ఊరుకున్నానూ?అల్లకల్లోలంగా చెల్లరేగాను. పారిపోయారు వెధవలు.

రాజు: సరే.మంచిపని చేశావ్, ఇంకేం రాణీ?

రాణి: మా తమ్ముడు అబద్ధం చెప్పినట్లు చప్పరిస్తారేం?

రాణీగారి తమ్ముడు: ఔను బావగారూ దైవసాక్షిగా.వాళ్ళనిపట్టుకు తీసుకొచ్చి చిత్రవధ చెయ్యాలి.

రాణి లేచి: ఔను. ఇంతగాపోనిస్తే ఎంతకైనా తెగిస్తారు. వాణ్ణి ఇప్పుడే తీసుకొచ్చి ఉరేయిస్తాను.

రాజు: రాణీ ——కూర్చోమని సైగచేసి– నేను న్యాయం చేస్తానుండు. ఎవర్రా అక్కడ?

రాణీగారి తమ్ముడు: నేను. –రా.కు. పగలబడి నవ్వుతుంది.

రాజు: ఎవరక్కడ? –భటులు వస్తారు.——ఎవర్రా తోటరాముడు,అంజి? ఎలావున్నవాళ్ళని అలా పట్టి తీసుకురండి.

★★★

గుడిసెవద్ద పూలుగుచ్చుతూ ముసలమ్మ(రాముడితల్లి) పాట... భక్తజనపోషకా నారాయణా... పాగాధరించి,బుర్ర మీసాలుపెట్టుకుని రాజు వేషంలో రాముడు, పక్కన అంజి వస్తారు. ...నిలుపనీ మనసులో నారాయణా, సంసారసాగరమె నారాయణా... అంజి: పిన్నీ.

ఆమె: పిన్నీ అని ఏ మొహంపెట్టుకుని వచ్చావురా——వాడి వేషం చూసి——ఏడీ వాడేడీ? –మరోపక్క రాముడు: శాంతమ్మా? –ఆమె సర్దుకుని:ఎవరునాయనా? –వేషధారి: మీ అబ్బాయి ఎక్కడ? ఆమె: లేదు.ఎక్కడికెళ్ళాడో? –ఆగంతకుడు: అన్నం పెట్టావా? ..

ఆమె:పెట్టే పంపానుబాబూ. –

ఆగం: గద్దిస్తూ——మూడు పూటలా కడుపునిండా పెడుతున్నావా?

–ఆమె: ఎందుకుపెట్టను బాబూ? కొన్నాళ్ళుంటారా?

అంజి: వాడితోపాటు వీడికీ పెడుతున్నావా?

–ఆమె వేషాలు గుర్తుపట్టి, రాముడు పెట్టుడు మీసం తీసేస్తాడు. ఆమె:హారిభడవా? టక్కులుకూడా నేర్చావూ? టోపీ,కుళ్ళాయి. ఈ వేషమేమిట్రా? ఎక్కడివిరా దుస్తులు?

–రాజభటులువచ్చి: రాజుగారు మీ ఇద్దరినీ తీసుకురమ్మన్నారు. ఊఁ.రండి.

రాముని తల్లి: అయ్యో.రాజుగారు రమ్మనడమేమిట్రా? ఏం నేరం చేశారో?

అంజి: ఊరికే బెదిరిపోతావేమిటి పిన్నీ. కాస్త కానుకలిచ్చి పంపుతారులే. అంతే.

రాము: భయపడకమ్మా. ఇప్పుడే వస్తాం.

తల్లి: ఏమో నాయనా.

–భటులు:నడవండి ఇద్దరూను.

★★★

రాజమందిరం—–రాజభటులు తోటరాముడినీ,అంజినీ రాజు సమక్షంలో ప్రవేశపెడతారు. నేపథ్యంలో: తోటరాముడంటే వీడేనా? రాణీగారి తమ్ముడు రాముడిని చూపెడతాడు.

రాముడు: నమస్కారం మహారాజా.—–రాజు పక్కనేవున్న రా.కు. కికూడా అభివాదం చేస్తాడు. ఆమె చిరునవ్వుతో తలదించుకుంటుంది. (రాగోదయం).

రాణీగారి తమ్ముడు: అంత ఠీవిగా నుంచున్నావేమిటి? తప్పుతప్పు. తలవంచుకు నిలబడాలి. –రాముడు అతడిమీదికి వెడతాడు. : తలవంచుకోడానికి నేనేం తప్పు చేశానని?

రాజు: వీడా తోట రాముడు? (ఫ్రేమ్‌లో రా.కు. రాముడినే చూస్తూ వుంటుంది.)

రాజు: ఎవరికీ తలవంచని యువకుల సాహసమే లక్ష్మి ఉజ్జయినికి. మన పరిజనమే ఇంత చూడముచ్చటగావుంటే?

రాణి: తర్వాత మెచ్చుకోవచ్చునుగాని, ముందు...

రాజు: విచారణ జరగాలికదూ? తిప్పలుపెట్టకుండా తప్పులు వప్పుకుంటావా అబ్బాయీ?

రాము: నిజం చెప్పమన్నారా? అబద్ధం చెప్పమన్నారా? మహారాజా.

రాజు: ఊహూఁ? –మెచ్చుకోలుగా నవ్వుతూ—–నిజమే చెప్పవోయ్.

రాము: ఐతే సత్రంలో గలాభాచేస్తుంటే ఆయన్నికొట్టాను .నిజమే ప్రభూ.

రాణీగారి తమ్ముడు: అబద్ధం.నేను రాణీగారి తమ్ముడునోయ్. నన్నే కొట్టానంటావ్?

రాము: మరి? కొట్టకేంచేస్తాను? రాణీగారి తమ్ముడుననీ, రాజుగారి బావమరదిననీ అందరినీ భయపెట్టి వినోదానికి పన్నేకావాలి అని చిన్న,పెద్ద తేడాలేకుండా తమకూ, తమ ప్రతిష్ఠకూ అవమానకరంగా ప్రవర్తిస్తూవుంటే (రా.కు. అతడిమాటలువింటూ తమలపాకులకు సున్నం రాస్తూ వుంటుంది. ) కొట్టాను. ముమ్మాటికీ నిజమే ప్రభూ.

రాణీగారి తమ్ముడు—–బెదురుతూ: వీడు నన్ను కొట్టలేదు. కొట్టలేదుకూడా.

అంజి: కొట్టలేకపోవడమేమిటి? తప్పుతప్పు. రాముడుకొడితే తమరు పారిపోయినప్పుడు జారిన పట్టుకుచ్చు కిరీటం. నవ్వు––ఆహాహాహా... కందువాలోంచితీసి బల్లపై పెడతాడు. (తిరుగులేని ఋజువు).

రాణీగారి తమ్ముడు:అదినాదా? –తల అడ్డంగా ఊపుతూ—–కాదు. –ఒకపక్క చెలికత్తెలు నవ్వుతారు.

రాజుగారునవ్వుతూ: రాణీ ఏఁవిటిదంతా? –రాణీ లేచి కొరకొరా చూస్తూ వెళ్ళిపోతుంది. రాణీగారి తమ్ముడు 'అక్కయ్యా' అంటూ ఆమె వెంట లోనికి పోతాడు.

రాజు: ఒరేయ్. అక్రమమైనా, అధర్మమైనా శిక్షించేది మేము. మా అధికారంతో మీరు చెయ్యిచేసుకోరాదు. బుద్ధికలిగి బతకండి. పొండి.

రాము రాజుకి నమస్కారం చేసి అదేచేత్తో రాకుమారికీ వందనం చెసి అంజితో నిష్క్రమిస్తాడు.

రాజు: ఇందూ.న్యాయం చేశానుకదూ? (పరధ్యానంగావున్న రాకుమారితో) ఇందూ. —సున్నం ఎక్కువగా పూసిన తమలపాకులు తండ్రి చేతిలో పెడుతుంది. రాజు నవ్వుతూ ఆమె మనసు గ్రహిస్తాడు. (పరేంగితజ్ఞత) రాకుమారి సిగ్గుతో తలవంచుకుని మందహాసం చేస్తుంది.

★★★

రాణీగారి తమ్ముడు రా.కు. కోసం వరండాలో ఎదురుచూస్తూ వుంటాడు. ఇందుమతి చెలికత్తెలతో ప్రవేశం.

రాణీగారి తమ్ముడు: తోటరాముడు నన్ను కొట్టాడంటే నమ్ముతావా? — ఇందు పరీక్షగా చూస్తే రాణీగారి తమ్ముడు చెంపలు తడుముకుంటాడు.

—ఇందు:అలాగేలే.

రాణీగారి తమ్ముడు: తప్పుతప్పు. వీరధీర శూరసేనుణ్ణి కొట్టాడంటే గొప్ప.

ఇందు: అలాగేలే.

రాణీగారి తమ్ముడు: అలాగేలే ఏమిటి? తప్పుతప్పు.

ఇందు: అలాగేలే. —నవ్వుతూ ముందుకు సాగుతుంది.

రాణీగారి తమ్ముడు నవ్వుతున్న చెలికత్తెలతో,హేళనగా——అలాగేలే. ★★★

రాజకుమారి అద్దంలో చూస్తూ పరవశించి ఆలాపన: లలలలలాలా లలలా లాలలలా... చేతులుకట్టుకుని ప్రతిబింబంతో: ఎవరికీ తలవంచని యువకుల సాహసమే లక్ష్మి ఉజ్జయినికి.

నర్మసఖి: ఊఁ.ఇంకా? భలేరాముడంటే ఏమనుకున్నారు? ఎంత సాహసమో? లేకుంటే...

ఇందు: లేకుంటే?

సఖి: మహారాజుగారు,మహారాణిగారు అక్కడుండగానే మీకు... జోహారు చేస్తారా?

ఇందు——గోముగా: నాకు కోపం వస్తుంది.

సఖి: వస్తే? —ఇందు ఆమెని సరదాగా కొట్టబోతుంది.

పాట

మేడపై నిండుపున్నమి వెన్నెలలో ––

ఇందు : కలవరమాయే మదిలో – నా మదిలో –

కన్నులలోన కలలే ఆయే మనసే ప్రేమ మందిరమాయె

తోటలో ఫౌంటెన్ వద్ద వెన్నెలలో––

రాము: కలవరమాయే –మదిలో నా మదిలో

కన్నులలోన గారడి ఆయే మనసే పూల మంటపమాయె

రాము : నాలో యేమొ నవరస రాగం – పిల్లనగ్రోవి ఊదిందీ

మోహాలేవో మోసులు వేసి – ఊహాగానము చేసే "కల"

ఇందు : కన్నులలోన కలలే ఆయే – మనసే ప్రేమ మందిరమాయే

కలవరమాయే మదిలో నా మదిలో

రాము : కలవరమాయే మదిలో నా మదిలో...

( ఈ సీను అనంతరకాలపు జానపదాలకు ఒరవడిగా నిలిచింది. నలుపు–తెలుపుల్లో వెన్నెల హాయిని విరియజేసింది)

***

(సశేషం)

COMMENTS